# నటభూషణా! నాగభూషణా!

## (పరిశోధనా పరమేశ్వరుడు)

- డా॥ రేవూరు అనంతపద్మనాభరావు

2015 ఫిబ్రవరిలో హైదరాబాదు తార్నాకాలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్కైవ్స్ ఆఫీసుకెళ్లాను. అక్కడ లైబ్రరీలో పరిశోధనకోసం ఏవో గ్రంథాలు వెదకడానికి వెళ్తే ఒక టేబుల్ ముందు ముఖానికి మాస్క్ కట్టుకొని, చేతిలో భూతద్దం పట్టుకొన్న వ్యక్తి కనిపించాడు. పక్కనే నెల్లూరు మిత్రుడు డా. కాళిదాసు పురుషోత్తం కన్పించాడు. ఇంతలో మాస్క్ వూడదీసిన ఆ వ్యక్తిని గమనించాను. ఎవరోకాదు - సుపరిచితులైన ఆత్మీయులు ఆచార్య మొదలి నాగభూషణశర్మ.

ఏడుపదుల వయస్సు దాటినా, ఆయనలో పరిశోధనాతృష్ణ తగ్గలేదు. నేను సాంస్కృతికశాఖవారి స్కాలర్‌షిప్‌పై ఆర్కైవ్స్‌కు వారంవారం వెళ్లేవాడిని. తరచు ఆయన వచ్చి ఎదురెదురుగా టేబుల్స్‌పై ఎవరి పని వాళ్లు చూసుకొనేవాళ్లం. తెలుగు నవలలపై ఆయన విస్తృత పరిశోధన చేస్తున్నారు ఆ సమయంలో.

1996లో కేంద్రసాహిత్య అకాడమీవారి ఆధ్వర్యంలో మూడురోజులు హైదరాబాదు రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన యక్షగాన సదస్సుకు సూత్రధారి శర్మ. ఆ సదస్సులో నేను కందుకూరి రుద్రకవి సుగ్రీవవిజయ యక్షగానంపై పత్రసమర్పణ చేశాను. యావద్భారత దేశంనుండి ఎందరో ప్రముఖులు వచ్చారు. అకాడమీ కార్యదర్శి జయంత్ కస్త్వర్‌కు కుడిభుజంగా మొదలివారు కర్త, కర్మ, క్రియా తానై నిలిచారు.

2006లో నేను కేంద్ర సాంస్కృతికశాఖ ఫెలోషిప్‌మీద రేడియో నాటకాలపై పరిశోధనచేస్తూ శర్మగారిని కలిశాను. ఎన్నో విశేషాలు చెప్పారు. విశ్వవిద్యాలయస్థాయిలో జరుగుతున్న పరిశోధనలు, అధ్యయనాల వివరాలందించారు. పూర్వాశ్రమంలో (యూనివర్శిటీలో చేరకముందు) ఆయన ఆకాశవాణి నాగపూరు కేంద్రంలో కొంతకాలం ప్రోగ్రాం ఎగ్జిక్యూటివ్‌గా పనిచేశానన్నారు. It is a loss to Radio and gain to University. ఆకాశవాణిలో వుంటే స్థానంవారితో కలిసి హైదరాబాదులో కార్యక్రమాలు నిర్వహించివుండేవారు.

* * *

### I. నాగభూషణశర్మ రచించిన జీవనరేఖా గ్రంథాలు

శర్మ వివిధ కాలాలలో, భిన్న సందర్భాలలో పలువురు నటజీవన స్రవంతికి చెందిన ప్రముఖుల జీవనరేఖలను, వారి నాటకాలను విశ్లేషిస్తూ గ్రంథాలు వెలువరించారు. వారి సాహితీకృషి త్రివేణీసంగమం.

1. ప్రముఖుల జీవనరేఖల రచన
2. నాటకాలపై సాధికారిక పరిశోధనాగ్రంథ రచన
3. విశ్వవిద్యాలయాలలో నటశిక్షణ

ఆయన జీవితమంతా నాటకరంగానికే ధారపోశాడు. ఎందరో యువకళాకారులకు విశ్వవిద్యాలయ బోధన ద్వారా అధ్యయన అధ్యాపనలతో మార్గదర్శి అయ్యాడు. ప్రస్తుత వ్యాసంలో వారి పరిశోధనా పర్వాన్ని మాత్రమే స్పృశిస్తున్నాను. శర్మగారు బహుముఖప్రజ్ఞాశాలి. ఆంగ్లాంధ్ర సంస్కృతభాషాకోవిదులు.

వస్తుతః ఆయన ఆంగ్లాచార్యులు. చదువుకున్నది ఆంగ్లభాషా సారస్వతాలు. అందువల్ల ఆంగ్ల సాహిత్యంపైన, ప్రత్యేకించి ఆంగ్లనాటకాలమీద పట్టు సాధించారు. వాటిపై సాధికారిక పరిశోధన చేశారు. వాటిని తెలుగు నాటకరంగ స్థితిగతులతో పోల్చిచూశారు. పరిశోధనాత్మక గ్రంథాలు వెలువరించారు.

ఆయనలో వున్న మరో విశిష్టత – ఆయన స్వయంగా నాటక రచయిత, విమర్శకుడు, దర్శకుడు, అధ్యాపకుడు – చతుర్ముఖబ్రహ్మ. ఇదేదో పొగడ్తకోసం వ్రాస్తున్న మాటకాదు. ఇన్నిరకాల ప్రతిభా వ్యుత్పత్తులు ఒక వ్యక్తికి బ్రహ్మ సమకూర్చాడు. ఆంగ్ల గ్రంథాలు 15, తెలుగు గ్రంథాలు 20 పైగా ప్రచురించారు. దేశమంతా తిరిగి నాటకప్రదర్శన లిచ్చారు. నాటకాలే కాదు జానపద కళారూపాల మీద కూడా విస్తృత క్షేత్రపరిశోధన కొనసాగించి గ్రంథరచనలు చేశారు. అమెరికన్ నాటకాలపై పిహెచ్.డి. పొందారు. ఇంగ్లీషు మాస్టారు నాటకాలలో ఎలా ప్రవేశించారనే సందేహం కలుగుతుంది. ఆయన 1973 లోనే M.F.A. డిగ్రీ చేయడానికి ఇల్లినాయ్ విశ్వవిద్యాలయం (అమెరికా) కెళ్లారు. అప్పటినుండి నాటకరంగంపై అభినివేశం పెంచుకున్నారు. శర్మగారు ప్రచురించిన అనేకానేక గ్రంథాలలో నాటక ప్రముఖుల జీవనరేఖలను ప్రస్తావిస్తాను. ప్రధానంగా ఆయన జీవనరేఖల వివరాలతో తృప్తిపడక వారి నాటక సాహిత్యాన్ని, నటనానుభవాన్ని పరిశోధనాత్మకదృష్టితో విశ్లేషించడం గమనార్హం.

**ఈ వ్యాస పరిధిలోని శర్మగారి గ్రంథాల వివరాలివి :**

1. (బళ్లారి రాఘవ) Bellary Raghava - Prince of Players.
   శరత్ అండ్ ఆనంద్ పబ్లిషర్స్, హైదరాబాదు – 1982.
   ముఖచిత్ర రచన – శీలా వీర్రాజు. ఆంగ్ల గ్రంథం.
2. Acharya Atreya and contemporary Telugu Theatre
   తెలుగు యూనివర్శిటీ, హైదరాబాదు, 1986. ఆంగ్ల గ్రంథం.
3. స్థానం నరసింహారావు నటజీవన ప్రస్థానం
   కళాతపస్వి క్రియేషన్స్, చెన్నై, 2013, అక్టోబరు. తెలుగు గ్రంథం.
4. ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటక సాహిత్యం : సమగ్ర పరిశీలన
   రంగసంపద, హైదరాబాదు, 2018 ఫిబ్రవరి. మూడు సంపుటాలు.
5. కల్యాణం రఘురామయ్య జీవితం.

**ఇవి జీవనరేఖలు కాగా, పరిశోధనా గ్రంథాలు మరికొన్ని :**

1. తెలుగు సాహిత్యం – గాంధీజీ ప్రభావం.
   గాంధీ సాహిత్య ప్రచురణాలయం, హైదరాబాదు 1970
2. తెలుగు నవలా వికాసం
3. నాటకశిల్పం. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు, 2008.
4. The Surabhi Theatre of Andhra - A living legend (ఆంగ్లం)
   రంగసంపద, హైదరాబాదు 2009 ఫిబ్రవరి.

5. నూరేళ్ల తెలుగు నాటకరంగం
6. కన్యాశుల్కం - నూరేళ్ల సమాలోచనం
7. నాట్యాంబుజము - నాట్య అశోకము - సంస్కరణ ప్రతి సంపాదకత్వం కళాతపస్వి క్రియేషన్స్, చెన్నై, 2011మే.
8. నాటకరంగ పారిభాషిక పదకోశం రంగసంపద - హైదరాబాదు, 2011 జులై.

**జీవనరేఖల వివరాల విశ్లేషణ**

## 1. Bellari Raghava - Prince of Players

ఈ ఆంగ్ల గ్రంథం శర్మగారు 1982లో ప్రచురించారు. పీఠికలో శర్మగారు ఈ గ్రంథరచనకు దారితీసిన అంశాలు ప్రస్తావించారు. 1980లో బళ్లారి రాఘవ శతజయంత్యుత్సవాలు దేశవ్యాప్తంగా జరిగాయి. ఆ సందర్భంగా దాక్షిణాత్య నాటకరంగానికి రాఘవ చేసిన సేవలను హైదరాబాదు, విశాఖపట్టణం, రాజమండ్రి, బళ్లారి సభలలో శర్మ మాట్లాడారు. అప్పటివరకు కె. దేశిపతిరావు వ్రాసిన 'రాఘవ జీవితచరిత్ర' తప్ప సాధికారిక గ్రంథమేదీ లేదు. మిగిలిన సావనీర్లు రాఘవ నటనాకౌశలాన్ని విశ్లేషించలేకపోయాయి. అట్టి సమయంలో రాఘవను ఆంధ్రేతరులకు పరిచయం చేయడానికి సంకల్పించి విశేషపరిశోధనతో విషయసేకరణ చేశారు. ప్రసక్తానుప్రసక్తంగా 20వ శతాబ్ది తొలిదశకాలలో నాటకరంగ స్థితిగతులను అధ్యయనం చేశారు. రాఘవ నటనాకౌశలం గూర్చి పలువురు మెచ్చుకున్నారే తప్ప ఆయనను గూర్చి ఆంగ్లంలో ప్రామాణిక గ్రంథం లేనిలోటును శర్మ భర్తీ చేశారు.

శీలా వీర్రాజు గీసిన ముఖచిత్రంతో శరత్ అండ్ ఆనంద్ పబ్లిషర్సు దీనిని ముద్రించారు. బళ్లారి రాఘవ డైరీలను రాఘవ అల్లుడు డి. వేణుగోపాలాచారి శర్మకు అందుబాటులోకి తెచ్చారు. వాటి ఆధారంగా 10 విభాగాలలో రచన కొనసాగింది.

1. రాఘవ - వ్యక్తిత్వం - గాథలు, 2. రాఘవనాటి కాలం, 3. ప్రతిభామూర్తి ఆవిర్భావం, 4. విజయ పరంపర, 5. అడ్వకేటుగా రాఘవ, 6. అత్యద్భుత ప్రదర్శనలు, 7. రెండు పరాజయాలు, 8. సంస్కరణాభిలాషి ఉత్సాహం, 9. నటనా చక్రవర్తి, 10. రాఘవ ప్రతిభ

ఈ పదింటికి అనుబంధంగా బళ్లారి రాఘవ 1930లో మైసూరు విశ్వవిద్యాలయంలో చేసిన ఉపన్యాసం - The South Indian stage - ఆంగ్ల వ్యాసం - ముప్పయిరెండు పుటలు; రాఘవ నటించిన వివిధ పాత్రలను చేర్చారు. 140 పుటల ఈ గ్రంథంలో రాఘవ నటనాకౌశలమేగాక వ్యక్తిగా ఆయన సాధించిన ఘనవిజయాలను శర్మ గ్రంథస్థం చేయగలిగారు. ఉత్తరదేశంలోని వారికి, విదేశీయులకు రాఘవను పరిచయం చేయడంలో ఈ ఆంగ్ల గ్రంథం సుసంపన్నమైనది. మధ్యమధ్యలో రాఘవ సమకాలీన వ్యక్తుల ఫోటోలు కూడా ముద్రించారు.

రాఘవ సినీజీవితంలోని ఘట్టాలను పేర్కొంటూ శర్మ తనదైన శైలిలో విపులీకరించారు. హెచ్.యం.రెడ్డి తీసిన 'ద్రౌపదీ మానసంరక్షణ' సినిమాలో రాఘవ దుర్యోధన పాత్ర ధరించారు. అదే సమయంలో యడవల్లి సూర్యనారాయణ నటించిన ద్రౌపదీ వస్త్రాపహరణం విడుదలైంది. ప్రేక్షకులు ఇద్దరు నటుల మధ్య తేడా గమనించారు. కె.వి. గోపాలస్వామి మాటలలో "యడవల్లి స్టేజినటుడిగా కనబరచిన ప్రతిభను సినిమాలోనూ చూపాడు. రాఘవ

మేధావులు మెచ్చుకొనే నటన చూపాడు. సగటు ప్రేక్షకుడు మెచ్చలేదు." రైతుబిడ్డ, చంద్రిక - సినిమాలు రెండింటిలో రాఘవ నటించాడు. అంతటితో సినీరంగానికి స్వస్తిచెప్పి రంగస్థలానికే పరిమితమయ్యాడని శర్మ వివరించారు.

**2. Acharya Atreya and contemporary Telugu Literature**

1986లో తెలుగు విశ్వవిద్యాలయం ఈ గ్రంథం ప్రచురించింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోని థియేటర్ ఆర్ట్స్ విభాగంవారు హైదరాబాదులో నాగభూషణశర్మ సారథ్యంలో 1986 మార్చి 23 నుండి 27 వరకు ఐదురోజులపాటు ఆత్రేయ నాటకోత్సవాలు నిర్వహించారు. ఆత్రేయ వ్రాసిన మూడు నాటకాలు ప్రదర్శించడంతోబాటు, సమకాలీన తెలుగు నాటకానికి ఆత్రేయ కృషిపై సెమినార్ కూడా నిర్వహించారు. ఆ సదస్సులో సమర్పించిన పత్రాల ప్రచురణతోబాటు ఆత్రేయపై ఆంగ్లంలో మోనోగ్రాఫు ప్రచురించారు. సదస్సులో ఆత్రేయకూడా పాల్గొనడం విశేషం.

శర్మ తన పరిశోధనలో ఆత్రేయ సమగ్రసాహిత్యాన్ని అవలోకనం చేసి నాటి స్వరూప స్వభావాలను ఆంగ్ల పాఠకులకు ఈ గ్రంథంలో అందించాడు. రెండు దశాబ్దాలకాలంలో 1943 - 1963 మధ్య ఆత్రేయ 10 నాటకాలు, 15 ఏకాంకికలు వ్రాశాడు. సినీరంగంలో ప్రవేశించి ప్రముఖ రచయిత అయిన తర్వాత ఆత్రేయ స్టేజినాటకాలు ఎక్కువ వ్రాయలేకపోయారని శర్మ నిర్ధారించారు.

**ఆత్రేయ వ్రాసిన 10 నాటకాలివి :**

1. గౌతమబుద్ధ (1943), 2. అశోక సమ్రాట్ (1944), 3. పరివర్తన (1945), 4. వాస్తవం (1946), 5. ఈనాడు (1947), 6. యన్.జి.ఓ (1947), 7. విశ్వశాంతి (1951), 8. కప్పలు (1953), 9. భయం (1954), 10. మనసు - వయస్సు (1963) - మరో 15 ఏకాంకికలు.

**ఆత్రేయ గురించి శర్మ ఇలా విశ్లేషించారు**

"Atreya is a pioneer who ushered in a new dramatic movement in Telugu - the Realistic movement. His plays have become landmakrs in the development of modern Telugu Theatre for their innovations in content and form."

ఆత్రేయకు, వెంకటగిరి అమెచ్యూర్ సంస్థకు గల ప్రగాఢ అనుబంధాన్ని శర్మ సోదాహరణంగా వివరించారు. 1945లో ఆంధ్ర నాటక కళాపరిషత్ తొలిసారిగా నడిపిన నాటకపోటీలలో వెంకటగిరి అమెచ్యూర్స్ సంస్థ పాల్గొంది. 'ఎదురీత' నాటకంలో ఆత్రేయ నాయకపాత్ర ధరించాడు. ఆ నాటకానికి ఉత్తమ ప్రదర్శన, ఉత్తమ రచన బహుమతులు వచ్చాయి.

**నాటక రచయితగా ఆత్రేయ**

"షేక్స్పియర్ నాటకాలన్నీ స్టేజిమీద ప్రదర్శించడానికి అద్భుతంగా పనికివచ్చాయి. దానికి కారణం ఆయన స్వయంగా నటుడు కావడమే. అందువల్ల ప్రదర్శనానుకూలతలు ఆయన నాటకాలకు వుండి అవి రక్తిగట్టాయి. తెలుగు నాటకరంగంలో కూడా ధర్మవరం, వడ్డాది సుబ్బరాయకవి, బలిజేపల్లి లక్ష్మీకాంతం వంటి ప్రముఖ రచయితలు, నటదర్శకులు ఉండేవారు. ఆ తరువాత ఆత్రేయ కాలం వరకు అలాంటివారు లేరు.

ఆత్రేయ తొలుత రంగస్థల మెళుకువలు తెలిసికొని తర్వాత నాటకరచనలు చేసి ఆ రంగంలో ఆద్యుడయ్యాడు" అని శర్మ నిర్ధారించారు.

**3. స్థానం నరసింహారావు నటజీవన ప్రస్థానం**

స్థానంవారితో నాగభూషణశర్మకు అనుబంధము, సాహచర్యము వుండటం వల్ల, ఇద్దరూ తెనాలివారే కావడంవల్ల ఈ గ్రంథం (150 పుటలు) చక్కని జీవితచరిత్రగా రూపొందింది. పురుషులే స్త్రీ వేషాలు వేసే రోజుల్లో రంగస్థలం మెట్టి విభిన్నమైన – ఒక్కొక్కప్పుడు పరస్పర విరుద్ధమైన పాత్రలను ధరించి ప్రతి పాత్రలోను తనదైన ప్రత్యేకతను చూపించి 30 సంవత్సరాలపాటు లక్షలాది మంది ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసిన ప్రతిభాశాలి స్థానం. ఆయన జీవితంలోని విభిన్న కోణాలను, ఆయన ధరించిన పాత్రలలోని విశిష్టతను, వ్యక్తిత్వ గరిమను ఈ పరిశోధనాగ్రంథం తేటతెల్లం చేసింది.

ఈ గ్రంథంలో ప్రకరణాలలో స్థానంవారి నటనా కౌశలాన్ని శర్మ తెలిపారు. (1) ఆ తొలిరోజుల జీవిత విశేషాలు (2) 1920 ప్రాంతాలలో తెలుగు నాటకరంగ స్థితిగతులు. 3. స్థానంవారి నాటకరంగ ప్రవేశం. (4) నాటకప్రస్థానం – రామవిలాస సభ. 5. ఇతర సమాజాలతో, నటులతో నాటకాలు. 6. కళాప్రతిభకు నీరాజనాలు. 7. రంగస్థలం నేర్పిన జీవితపాఠానికి నటనావైదుష్యం.

ఈ ప్రకరణాలతోబాటు అనుబంధాలు ఐదింటిలో ఇతర అంశాలు ఉదహరించారు. నటనా వైదుష్య ప్రకరణంలో శర్మ ఒక ఉదంతాన్ని ఉటంకించారు.

పిఠాపురంలో స్థానం రోషనార వేషంవేశారు. మర్నాడు ఉదయం స్థానం, దేవులపల్లి నడుచుకుంటూ బజార్లో వెళుతున్నారు. ఓ స్నేహితుడు స్థానాన్ని గుర్తుపట్టలేదు. దేవులపల్లితో – "ఏం చేశాడ్రా ఆ రోషనారాగాడు! వాడికి ఎన్ని వరహాలిస్తేనేం.... వాడు నటుడంటే" అని ప్రశంసించాడు.

శర్మ స్థానం నటనను నాలుగు విషయాలలో బేరీజు వేశారు.

1. నటనా చాతుర్యం, 2. నటనా వైదుష్యం, 3. నటనా వైశిష్ట్యం, 4. వ్యక్తిత్వ వైశిష్ట్యం.

శర్మ మాటల్లో – "స్థానం నాటక ప్రథమ ప్రదర్శనవరకు నిత్యవిద్యార్థిగా మారేవాడు. ముందుగా పాత్రకు సరిపోలిన స్త్రీలను వెతికి కనుక్కోవడం ఒక ఎత్తు. వారి వేషభాషలు జాగ్రత్తగా చూసి సరిగ్గా అటువంటి దుస్తుల్ని ఏరికోరి శ్రమపడి సమకూర్చుకోవడం మరో ఎత్తు. నిజానికి వేషభాషలు బాహ్యాలంకరణకే! అసలు సమకూర్చుకో వలసింది ఆ పాత్రను సూచించే, ప్రతిబింబించే అంతరభావన" అంటారు పరిశోధనాదృష్టితో శర్మ.

**4. ధర్మవరం రామకృష్ణమాచార్యుల నాటక సాహిత్యం – సమగ్ర పరిశీలన**

ఆంధ్రనాటక పితామహుడు ధర్మవరం రామకృష్ణమాచార్యులు ప్రతిభావంతమైన నటుడు, దర్శకుడు, సంగీతసారధి, ప్రయోక్త. 25 సంవత్సరాలు నాటికకు ఊపిరిగా సంచరించిన మహామేధావి. వారి జీవిత, నాటక జీవిత విశేషాలతో రంగసంపద ప్రచురణగా 2018లో శర్మ మూడు సంపుటాలకు సంపాదకత్వ బాధ్యత తలకెత్తుకొన్నారు. నాటకరంగంపై అధ్యయన అధ్యాపనలు కొనసాగించిన సుదీర్ఘానుభవం వుంది. అందువల్ల ఎన్నో నూతనాంశాలను సుదీర్ఘపీఠికలోను, ప్రతి నాటకానికి పరిచయంలోను వెలిబుచ్చారు.

ఆచార్యులవారి 20 నాటకాల సంక్షిప్త పరిచయం పేరుతో 90 పుటల సాధికారిక పరిశోధనాంశాల సమకూర్చారు. ఆచార్యులవారు తెలుగు నాటకరంగానికి చేసిన సేవ అనే ప్రకరణంలో 9 ప్రతిపాదనలు చేశారు.

1. స్వతంత్రనాటకాలను పుంఖానుపుంఖాలుగా వెలువరించిన ఖ్యాతి.
2. షేక్స్‌పియర్‌లాగానే ధర్మవరంవారు పురాణగాథల్ని, పురాగాథల్ని నాటకీకరించారు.
3. తరువాత తరాల నాటకరచయితలకు మార్గదర్శకుడు.
4. నాటకాలపేర్లు కథాసూచనలుగా, ఆలోచనాత్మకంగా రూపొందించారు.
5. షేక్స్‌పియర్, యితర పాశ్చాత్య నాటకాలలోని రూపగీత పద్ధతులను స్వీకరించారు, అంకాన్ని రంగాలుగా విభజించారు.
6. భాషావిషయకంగా సంప్రదాయవాదులు.
7. నాటకం మధ్యలో ఆనాటి సాంఘిక దురాచారాలను విమర్శించారు.
8. నాటకాన్ని ప్రదర్శనయోగ్యంగా తెలియచెప్పిన మాంత్రికుడు.
9. విషాదనాటకాలలో స్వగతాలు ప్రవేశపెట్టారు.

ఈ నవవిధ నూతనాంశాలను శర్మ విశదీకరించారు.

“మూడు భాషలలో 31 నాటకాలు వ్రాసి తెలుగులోనే నాటకాలు వ్రాయాలన్న తన దృఢ నిశ్చయాన్ని జీవితాంతం అమలుపరచారు. కన్నడంలో వ్రాస్తేనే నాటకం అన్న నాటకమిత్రుల అభిప్రాయాన్ని వమ్ముచేసి తెలుగులోనే నాటకరచన చేసి ఇంటగెలిచి రచ్చగెలిచిన ధీరుడు ఆచార్యులవారు” అని శర్మ ధర్మవరంవారి నాటక రచనా వైశిష్ట్యాన్ని గూర్చి ప్రకటించారు.

ఆచార్యుల ప్రసిద్ధ నాటకాలు – రెండు. 1. చిత్రనళీయము, 2. విషాద సారంగధర. అందులో రెండు ప్రధానాంశాలు శర్మ ప్రతిపాదించారు. ఒకటి నాటక నిర్మాణచాతుర్యం. రెండవది భారతీయ నాటక సంప్రదాయాలకు విరుద్ధమైనా తెలుగులో ప్రవేశపెట్టడం.

ధర్మవరం వారి నాటకాలలో పాత్రలు ధరించిన వివిధ నటుల ఫోటోలు ఈ పరిశోధనా గ్రంథం విలువను పెంచాయి.

**5. కల్యాణం రఘురామయ్య జీవితం**

కృష్ణుడిగా, ఈలపాట రఘురామయ్యగా ప్రసిద్ధికెక్కిన రఘురామయ్య నటజీవిత విశేషాల గ్రంథమిది.

## II. శర్మగారి పరిశోధనాత్మక గ్రంథాలు

**1. తెలుగు సాహిత్యంపై గాంధీజీ ప్రభావం**

ఈ పరిశోధనాత్మక గ్రంథంలో 9 ప్రధాన ప్రకరణలున్నాయి. 1) సాహిత్యం – జాతీయత, 2. కావ్యసాహిత్యం, 3. గాంధీశతకాలు, 4. ఖండకావ్యాలు, 5. గేయాలు–పాటలు, 6. కీర్తనలు, భజనలు, 7. నాటకసాహిత్యం, 8. నవలా సాహిత్యం, 9. జీవితచరిత్రలు – సిద్ధాంత గ్రంథాలు.

1970ల నాటికి గాంధేయ సాహిత్యంపై విస్తృత పరిశోధనా గ్రంథం రాలేదు. విశ్లేషణాత్మక విమర్శలు లేవు. "తెలుగులో రాజకీయసాహిత్యం గాంధీజీతో ప్రారంభించి వికసించిం"దని శర్మ ముందుమాటలో అభిప్రాయపడ్డారు. విశేషపరిశ్రమ చేసి దాదాపు 800 గ్రంథాలు పరిశీలించి వివరణాత్మకంగా గ్రంథం రూపొందించారు. వివిధ గ్రంథాలయాలకు వెళ్లారు. అధికశ్రమతో పరిశ్రమించారు. 250 పుటల గ్రంథం తయారుచేశారు. ఇప్పటికీ గాంధీజీ సాహిత్యంపై అది ప్రామాణిక గ్రంథం.

నవలాసాహిత్యం గూర్చి చెబుతూ – "అవి అన్నీ నాటకాలలా గాక ఆనాటి సాంఘిక జీవనాన్ని స్పష్టంగా ప్రతిబింబించే రచనలు. గాంధీజీ ప్రభావము పల్లీయులను ఎలా మార్చిందో 'మాలపల్లి', 'కొల్లాయి గట్టితేనేమి' – చూపుతాయి. పట్టణాలలో ఎలా మార్చిందీ 'నారాయణరావు', 'చదువు' చెబుతాయి. వ్యక్తులను ఎలా మార్చిందో 'కోనంగి', 'చివరకు మిగిలేది' చూపుతాయి. ఇలా అన్ని దశలలోని, వయసులలోని మనుష్యులపై గాంధీజీ ప్రభావం ఎంత విస్తృతమైనదో, ఎంత లోతైనదో నవలాసాహిత్యం మనకు చెప్పగలదు" అంటారు శర్మ.

**2. తెలుగు నవలా వికాసం**

"తెలుగు నవలాసాహిత్యాన్ని గూర్చి వెలువడ్డ గ్రంథాలలో పేర్కొనదగినవి – శ్రీ మొదలి నాగభూషణశర్మ తెలుగు నవలా వికాసం, శ్రీ పుల్లాభొట్ల వెంకటేశ్వర్లు తెలుగు నవలాసాహిత్య వికాసం" అని తెలుగులో పరిశోధన అనే గ్రంథంలో డా. అక్కిరాజు రమాపతిరావు విశ్లేషించారు.

ఆ గ్రంథాన్ని మరింత విస్తృతపరచి వ్రాయాలనే సంకల్పంతో ఈ వయస్సులో కూడా ఆర్కైవ్స్‌లో కూచొని పాతగ్రంథాలనన్నింటినీ అవలోకనం చేసి 'నోట్స్' తయారుచేసుకొన్నాను. ఆయన 'పరిశోధన రాక్షసుడు'. ఎం.ఏ. డిగ్రీ చేతికిరాగానే పుస్తకాలు చదవడం మానేసే అధ్యాపకులున్న ఈరోజుల్లో ఆయన అవిశ్రాంత పరిశోధకుడు, నిత్యనూతన ఆలోచనాపరుడు.

**3. నాటక శిల్పం**

ఈ పరిశోధనా గ్రంథం ఈ సరళిలో వచ్చిన పుస్తకాలలో ప్రథమం. భారతీయ పాశ్చాత్య నాటక రచనా సంవిధాన విశ్లేషణ, విభిన్న ప్రక్రియల విశేషాల విమర్శనాత్మక వివరణ, వివిధ మాధ్యమాల తులనాత్మక పరిశీలన – ఈ గ్రంథంలో విస్తృతంగా చర్చించబడ్డాయి. విశ్వవిద్యాలయ స్థాయిలో అధ్యయన అధ్యాపనాలు కొనసాగించిన శర్మ ఎం.ఏ. తరగతుల థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని పాఠ్యగ్రంథంగా దీనిని తయారుచేశారు.

ముందుమాటలో శర్మ చెప్పినట్లు " ఈ పుస్తకానికి నిజమైన రచయితలు 40 సంవత్సరాలపాటు నేను పాఠాలు చెప్పిన వివిధ విశ్వవిద్యాలయాలలోని రంగస్థల శాస్త్ర విద్యార్థులు. వాళ్లందరికీ పాఠాలు చెప్పడం ఓ అద్భుతమైన అనుభవం" – ఇది టెక్స్ట్‌బుక్. ఈతరం అధ్యాపకులకు కరదీపిక.

**ఇందులో 10 ప్రకరణలున్నాయి.**

1. నాటకం – భూమిక, 2. నాటక ప్రత్యేకత, 3. నాటక రచనాంశాలు, 4. పాత్రచిత్రణ, 5.భాష, 6. ప్రదర్శనాంశాలు, 7. భారతీయ నాటక ప్రక్రియలు, 8. పాశ్చాత్య నాటకప్రక్రియలు, 9. నాటకం – ఇతర మాధ్యమాలు, 10. నాటక విశ్లేషణ

ఈ అంశాలకు తోడు అనుబంధంలో సంక్షిప్త నాటక పరిభాషను ప్రచురించారు. టి.వి. మాధ్యమం గూర్చి చక్కని ఛలోక్తి విసిరారు.

"మిగిలిన మాధ్యమాలలా కాకుండా - అతి త్వరగా పెద్దమనిషి అయి, కాపురానికి పోయి, పిల్లల్ని కనేసిన చిన్నపిల్లలా - అనిపిస్తుంది టి.వి. మాధ్యమాన్ని చూస్తే. దీనికి కొంత కారణం (కనీసం మనదేశంలో) టి.వి. మాధ్యమం చాలాకాలం ప్రభుత్వం చేతులలో వుండటం" అంటారు. (పుట. 183)

**4. The SURABHI THEATRE OF ANDHRA - A LIVING LEGEND**

ఇది 270 పుటల విస్తృత ఆంగ్ల పరిశోధనా గ్రంథం.

సురభి నాటక కంపెనీ తెలుగుల వరం. 120 సంవత్సరాలపైగా చరిత్రగల నాటకసమాజం. ఆ సంస్థతో శర్మకు సన్నిహితపరిచయం వుంది. హైదరాబాదులో ఏటా డిసెంబరు 19న సురభి నాటకోత్సవాలను శర్మ, తదితర మిత్రబృందం ఎన్నో ఏళ్లుగా నిర్వహిస్తున్నారు. ప్రపంచం దృష్టికి సురభి పరిమళాలను వ్యాపింపజేశారు. సురభి సంస్థ సభ్యులతో మమేకమై శర్మ ఎన్నో ఏళ్లు గడిపి ఈ గ్రంథానికి అవసరమైన విషయసేకరణ చేశారు.

**5. నూరేళ్ల తెలుగు నాటకరంగం**

**6. కన్యాశుల్కం - నూరేళ్ల సమాలోచనం**

ఈ రెండు గ్రంథాలపై సమీక్షలు పూర్వం వెలువడ్డాయి.

**7. నాట్యాంబుజము అండ్ నాట్య అశోకము**

పురాణం సూరిశాస్త్రిగారి తొలి తెలుగు నాటకవిమర్శ గ్రంథాలైన నాట్యాంబుజము మరియు నాట్య అశోకములను సంస్కరణ ప్రతి తయారుచేసే సంపాదక బాధ్యతలు శర్మ తలకెత్తుకున్నారు. పురాణం సూరిశాస్త్రి (1888 - 1941) తెలుగుదేశాన్ని ప్రభావితం చేసిన ముగ్గురు మహనీయులలో ప్రథములు - వారు - పురాణం సూరిశాస్త్రి, పసుమర్తి యజ్ఞనారాయణశాస్త్రి, (వీరిద్దరు బందరువారు) మూడోవారు రాజమండ్రికి చెందిన శ్రీపాద కామేశ్వరరావు.

నాట్యాంబుజము తొలి ప్రచురణ 1923లో. విద్యానిలయం, బందరు పక్షాన ప్రచురితం. నాట్యఅశోకము అదే సంస్థ 1925 -27లో ప్రచురించింది. ఈ రెండింటినీ క్షోదక్షమంగా పరిష్కరించారు నాగభూషణశర్మ. మూలగ్రంథంలోని కన్నడ, తమిళ, సింహళ నాటకాలు, బొంబాయి, కలకత్తాలోని నాట్యశాలలు, నాటకాల ప్రస్తావనలను శర్మ పరిహరించడం ఔచితీవంతం.

తెలుగు నాటకరంగ విమర్శనా చరిత్రకు సంబంధించినంతవరకు ఇవి ప్రధానగ్రంథాలు. అందువల్ల విపులమైన పీఠికను, ఫుట్‌నోట్స్‌లను శర్మ పాఠకుల సౌకర్యంకోసం సమకూర్చారు. నాట్యాంబుజంలోని 8 దశలు:

1. నాటకానుభవములు, 2. ఆంధ్రనాటకములు, 3. నాటకసమాజములు, 4. ప్రసిద్ధ నటులు, 5. ప్రదర్శన విమర్శనములు, 6. పరిహరించారు (సంపాదకులు), 7. నాటక సమస్యలు, 8. నాటక విమర్శనము.

ప్రసిద్ధ నటులను గూర్చిన వివరణలు ఈవని లక్ష్మణస్వామి మొదలు బళ్లారి రాఘవ వరకు దాదాపు 80 పుటలకు విస్తరించాయి.

నాట్య అశోకములోని మొదటి మూడు అధ్యాయాలను శర్మ వదలివేశారు. (తాటాకులలో పచార్లు, చెట్టుక్రింది ముచ్చటలు, శ్రీరామా నాట్యలేఖలు) మిగిలిన 11 ప్రకరణాలు విషయభరితాలు :

1. రామదాసు, 2. హరిశ్చంద్ర, 3. నటప్రకాశిక నాటకాలు, 4. ఆంజనేయ నటేశము, 5. కన్యాశుల్కము, 6. ప్రతాపరుద్రీయము, 7. షోరబు – రుస్తుం, 8. దొరస్వామి – దుష్యంతుడు, 9. గంజాం నటులు, 10. చంద్రహాస – నటలోకసంచారము, 11. మృచ్ఛకటిక.

ఇది 150 పుటల గ్రంథం. పరిష్కరణలో శర్మ తమ నాటకానుభవాన్ని చక్కగా ప్రదర్శించారు.

**8. నాటకరంగ పారిభాషిక పదకోశం**

ఈ గ్రంథం మౌలికమైన పరిశోధనాత్మక గ్రంథం. ఇంతకాలం ఏ సంస్థగాని, పండితుడుగాని స్పృశించని అంశం. ఇది ఆంగ్లాంధ్రభాషలు రెండింటిలోను శర్మ శ్రమించి తయారుచేశారు. ఇది నటవిద్యార్థులకేగాక, అధ్యాపకులకు, పరిశోధకులకు కరదీపిక. సూర్యాంధ్ర నిఘంటు నిర్మాణానికి ఏళ్ల తరబడి పండితబృందం కృషిచేసింది. ఒక్కచేతిమీదుగా ఈ గ్రంథాన్ని సమకూర్చిన శర్మ జీవితం ధన్యం.

తెలుగు నాటకరంగంలో వాడుకలోవున్న పాశ్చాత్య సాంకేతిక పదాలకు తెలుగు సమార్థకాలు, ఆంగ్ల, ఆంధ్రభాషలలో ఆ పదాలకు వివరణ అందించారు. అంతేగాదు, పాశ్చాత్యదేశాల నాటకరంగ చరిత్రను గూర్చిన అంశాలు, విభిన్న నాటక ఉద్యమాల, సిద్ధాంతాల సంక్షిప్త పరిచయము 400 పుటల గ్రంథంలో సోపపత్తికంగా శర్మ అందించారు. విశ్వవిద్యాలయాలు చేయవలసిన పనిని వొంటిచేతిమీదుగా పూర్తిచేశారు.

ఈ పారిభాషిక పదకోశ నిర్మాణంలో తాను పాటించిన నియమాలను శర్మ ముందుమాటలో ఉటంకించారు.

"ఆంగ్లపదాన్ని రెండుమూడు అర్థాలలో వాడిన సందర్భాలను సూచించడానికి (ఉదా. black out : కాంతిరాహిత్యం; స్మృతిరాహిత్యం). ఇంగ్లీషు పదాలు ప్రాచుర్యం పొందినవై ఉంటే ఆంగ్లపదాన్ని దానితోపాటు తెలుగు సమానార్థకాన్ని కూడా ఇచ్చాను. ఉదాహరణకు jack అనే పదానికి జాక్ అనీ 'ఊతకోల' అనీ సమానార్థకాలుగా ఇవ్వడం జరిగింది. రెండు తెలుగు సమానార్థకాలు ఉంటే ఆ రెంటిని (ఉదా : curtain : యవనిక / తెర) యివ్వడం చూడవచ్చు."

ఆవిధంగా ఒక నిర్దిష్ట, నిర్దుష్ట ప్రణాళికను తయారుచేసుకుని ఈ బృహత్తర పారిభాషిక పదకోశం శర్మ దీక్షాదక్షతలతో సంపన్నం చేశారు. ఉదాహరణకు అంతర్నాటకం అనే పదబంధానికి (పుట. 273) 'play wihin a play' అని ఆంగ్లంలో విపులార్థం చేకూర్చారు. ఉదాహరణంగా పిరాండెల్లో రాసిన six characters in search of an author" పేర్కొన్నారు. పాశ్చాత్య నాటకాలపై శర్మకున్న పట్టుకు ఇది నిదర్శనం.

ఈవిధంగా ప్రతిభావ్యుత్పత్తులు గల నాగభూషణశర్మ ఒక మేరుశిఖరం వంటి వ్యక్తి నాటకరంగ చరిత్రలో. వారికి అప్పాజోస్యుల విష్ణుభొట్ల కందాళం వారి 'ప్రతిభామూర్తి' పురస్కారం సముచితం.

# తెలుగు వెలుగు

**- డాక్టర్ కడియాల రామమోహనరాయ్**

శ్రీ మొదలి నాగభూషణశర్మ నాటక రచయిత, నటుడు, దర్శకుడు, నాటక విమర్శకుడు, పరిశోధకుడు, నటశిక్షకుడు, తెలుగునాట నాటకోద్యమానికి తోడ్పడిన నాటకరంగ ప్రముఖుడు.

అర్ధశతాబ్దికి పైబడిన కాలంలో తెలుగు నాటకరంగ చరిత్ర నాగభూషణశర్మగారి నాటకరంగ కృషితో ముడిపడివున్నది. ఎనిమిదవ ఏటనే తండ్రిగారి ప్రోత్సాహంతో నటునిగా నాటకరంగంలో ప్రవేశించారు. రాముని బుద్ధిమంతనం (శరత్‌బాబు రచన) లో నటించారు (1951).

చిన్నవయసులోనే శర్మగారు రచించిన 'అన్వేషణ' నాటిక సుప్రసిద్ధ సాహిత్యమాసపత్రిక 'భారతి'లో ప్రచురితమైంది. తరువాత 'జంటపక్షులు' (భారతి) 'అడ్డదారి' (ఆంధ్రప్రభ) నాటికలు వీరికి నాటక రచయితగా గుర్తింపు తెచ్చిపెట్టాయి.

1955 నుండి విజయవాడ, హైదరాబాదు రేడియో కేంద్రాలు వీరి నాటికలను ప్రసారం చేశాయి. సుప్రసిద్ధ రచయిత బుచ్చిబాబు, ప్రఖ్యాత కవి దాశరథి ఆకాశవాణి అధికారులుగా వీరి నాటక రచనలను ప్రోత్సహించారు.

తొలిదశలో శర్మగారు నాటకరచన చేస్తున్న కాలంలో ప్రఖ్యాత నాటకరచయిత, ప్రయోక్త కొప్పరపు సుబ్బారావు నాటకరచనలో కొన్ని మెలకువలను సూచించి మార్గదర్శకులైనారు.

ఇంగ్లీషు సాహిత్యాన్ని మక్కువతో అధ్యయనం చేసిన శర్మగారు ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆచార్యునిగా పనిచేశారు.

నాగభూషణశర్మగారి వీలునామా (1955), 'కల-కాపురం' (1955-56), 'అడ్డదారి' (1958) నాటికలు ఏభైయేళ్ల తర్వాతగూడ చదివి ఆనందించ నాటక సమాజాలు తిరిగి ప్రదర్శించదగినవి.

'అమెరికా నాటకరంగం' పై పరిశోధన చేసిన శర్మగారు అమెరికాలో పెక్కు ఇంగ్లీషు నాటకాలు, నాటికలు చూశారు. నాటకరంగ ప్రయోగంలో మెలకువలను ఆకళించుకున్నారు. 'బియాండ్ ది హొరైజన్; 'హెయిరీ ఏప్', 'డిజైర్ అండర్ ది ఎల్మ్స్', 'స్ట్రేంజ్ ఇంటర్లూడ్ (యూజిన్ ఓనీల్), 'ఎ స్ట్రీట్‌కార్ నేమ్డ్ డిజైర్', 'కేట్ ఆన్ హాట్‌టిన్‌రూఫ్', 'ది మిల్క్ ట్రెయిన్ డజన్ట్ స్టాప్ హియర్ (టెనెస్సి విలియమ్), 'ది డెత్ ఆఫ్ ఎ సేల్స్‌మాన్ (అర్థర్ మిల్లర్) నాటకాలలోని వివిధ జీవితకోణాలను పరిశీలించారు. ఆధునిక తెలుగునాటక వికాసానికి విశ్వవిఖ్యాత నాటకాల నుండి ప్రేరణ పొందవలసిన అవసరాన్ని గుర్తించారు.

USA - Wisconsin - Illinois విశ్వవిద్యాలయంలో పరిశోధక విద్యార్థిగా వున్నప్పుడు నాటకానికి దర్శకత్వం వహించారు. పిక్‌నిక్ ఆన్ ది బేటిల్‌ఫీల్డ్ నాటకానికి సహాయ దర్శకులుగా వున్నారు.